# మౌలిక తేజానికి పరావర్తనమే 'చేతనావర్తం'

భారతీయ చింతనతో సాంస్కృతికమైన నవోజ్జీవన లక్ష్యం కలిగిందీ, తాత్త్వికమైన భూమికతో వర్తించేదీ, సామాజిక సమస్యల పట్ల విహగావలోకనం కలిగిందీ, చేతనావర్త పార్శ్వం. దిగంబర కవిత్వానికి ప్రతిక్రియగా ఇంచుమించు సమాంతరంగా ఆవిర్భవించింది. చేతన యొక్క ఆవర్తం లేదా చేతనతో ఆవర్తం కలిగిందీ. ఆవర్తమంటే ఒక చుట్టుచుట్టి రావడం, ఇందులో క్రమమూ వేగమూ ఉంటాయి. భౌతికమైన స్థితితలం నుండి మానసికమైన నిర్మాణ రూపాన్ని కలిగింది. ఈ నిర్మాణ రూపం సాధారమైన నైతికం నుండి ఆధ్యాత్మికం దాకా పర్యాప్తమైంది. ఇందులో సమాజతలంపై భౌతికంతోపాటు మానసికమైన వికాసాన్ని కోరుతూ, ఆత్మోన్నతి నభిలషించే ఆదర్శం లక్షితమైంది. చేతనావర్త కవులు నలుగురు. 1. కోవెల సంపత్కుమారాచార్య, 2. పేర్వారం జగన్నాథం, 3. కోవెల సుప్రసన్నాచార్య, 4.వేనరెడ్డి. ఈ నలుగురి కవిత్వం వారి వారి ప్రత్యేకతలతో వ్యక్తిలో చేతన యొక్క వివిధావర్తాల చిత్రణాన్ని ఉద్దేశించింది. ఇదంతా విశ్వాత్మ చేతనలో భాగంగా గుర్తించడంతో ప్రత్యేకతను సంతరించుకుంది. చేతనావర్తం మొదటి సంపుటం 1969లో అరవిందులు జన్మించిన ఆగస్టు నెలలో వచ్చింది. రెండో సంపుటం 1970లో వెలువడింది. ఈ కవిత్వం తాత్త్విక తలంపై భౌతిక శక్తుల్ని పరిగణిస్తూ అంతశ్శక్తికీ అతీత శక్తికీ దివ్యదశలకూ ప్రాధాన్యాన్ని ఇవ్వడం కన్పిస్తుంది.

వ్యక్తి సంస్కార స్థితులతో వికాస దశలతో జీవితంలో ఆరోహణ నభిలషిస్తుంది. అయితే ఒక్కొక్కరి కవిత్వంలో ఒక్కొక్క విధమైన అంతస్తత్త్వం ఆవిష్కృతమయింది. జీవితంలో ఆశ, నిరాశ, ధైర్యం, భయం, సుఖం, దుఃఖం, వెలుగూ, చీకటీ ఇట్లా అనేక ద్వంద్వాల మధ్య కదలే జీవితంలో వివిధ దశల్లో చైతన్యం ఆవర్తాన్ని పొందుతుంది. ఆవర్తంతో సంధి దశల్లో కల్లోలం నుండి అశాంతి నుండి మనిషి సచేతనంగా ఉద్గమించడం జరుగుతుంది. పై దశలో దీనికి ప్రయత్నమూ సాధనమూ అవసరం. ఇందుకు తగిన రీతిలో జ్ఞానం, వివేకం, శిక్షణ, సాధన, లక్ష్యమూ తోడ్పడతాయి. ఆరోహణలో క్రమంగా మనస్సు దివ్య జీవనాన్ని స్పృశించడం జరుగుతుంది. ఇందులో 1) అరవిందుల దివ్య జీవన సాధనం, దర్శనం, 2) సంప్రదాయ బంధురమైన ఆత్మ- పరమాత్మ తత్త్వోన్మీలనం, 3) రామకృష్ణ వివేకానందుల బోధల పరనార్థం 4) [illegible]రతీయ సంస్కృతికి చెందిన తేజోరేఖలు కొన్ని అందుతాయి. స్థూలంగా ఇదీ దీని తాత్త్విక భూమిక. ఇక సాహిత్యానికి వస్తే రచయిత ఏ సిద్ధాంతాన్నైనా, ఏ రాజకీయ దృక్పథాన్నైనా కలిగి ఉండవచ్చు. కాని రచన మాత్రం కవితాత్మకంగా ఉండాలన్నదే వీరి ముఖ్యమైన ఆశయం. జీవితాన్ని గురించి ఆలోచన జరుపుతూనే, అనుభవాన్ని స్పందింపజేస్తూనే, తాత్త్విక స్పర్శను కలిగి ఉండడం చేతనావర్త కవుల ప్రత్యేకత. ఇది ఈ నలుగురిలో ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధమైన కవితా రూపాన్ని పొందింది, ఒకే మూసలో పోసినట్లు కాకుండా వారి వారి స్వతంత్రమైన వ్యక్తిత్వ

> **వ్యక్తి సంస్కార స్థితులతో వికాస దశలతో జీవితంలో ఆరోహణ నభిలషిస్తుంది. అయితే ఒక్కొక్కరి కవిత్వంలో ఒక్కొక్క విధమైన అంతస్తత్త్వం ఆవిష్కృతమయింది. జీవితంలో ఆశ, నిరాశ, ధైర్యం, భయం, సుఖం, దుఃఖం, వెలుగూ, చీకటీ ఇట్లా అనేక ద్వంద్వాల మధ్య కదలే జీవితంలో వివిధ దశల్లో చైతన్యం ఆవర్తాన్ని పొందుతుంది. ఆవర్తంతో సంధి దశల్లో కల్లోలం నుండి అశాంతి నుండి మనిషి సచేతనంగా ఉద్గమించడం జరుగుతుంది.**

వికాసాల్ని భాసింపజేస్తూంది. సంపత్కుమార "ఈ క్షణం మీద పరచిన ఊహలతో కాలానంత పరిణామాన్ని గుర్తించకుండా బ్రతికే మనిషి భవిష్యత్తు శూన్యం". ఇందులో వర్తమాన జీవితం సూచించారు. మార్పు అనివార్యమన్న తత్త్వం ప్రపంచితమైంది. దీన్ని గుర్తించడం వివేకవంతమైందన్న భావనతో పర్యాప్తమైంది. ఈ వివేకం లోపిస్తే అంతా వ్యర్థమే. సాధారణమైన లౌకిక స్థితి చిత్రణం ఆధారంగా, దీని వెనుకనుండి పనిచేసే పరివర్తన శక్తినీ, దాని ప్రభావాన్నీ, జీవిత గమనాన్నీ, వ్యక్తి కర్తవ్యాన్నీ భావింపజేస్తుంది.

పేర్వారం జగన్నాథం "మంచికైనా, చెడుకైనా మానవుడే కేంద్ర బిందువు". మనిషి ఔన్నత్యాన్ని ఆవిష్కరించే ఈ పంక్తులు, మనిషిలోని శక్తిని గ్రహించి ప్రేరేపిస్తాయి. ఈయన కవిత్వంలో వివేకానందుల స్ఫూర్తితో వెలసిన భావజాలం మనస్సులో మెదలుతుంది. ఇది సంపూర్ణ జీవితంలో ఒక దశకు చెందింది. అవసరాల్నిబట్టి ప్రాధాన్యం కలిగిందీ, ఆదర్శవంతమైన జీవితాన్ని ఉద్దేశించిందీ.

సుప్రసన్నాచార్య వీరిలో అధికమైన ఆధ్యాత్మికానుభవం బింబించే కవి, "అతడు పాడతాడు ప్రబోధ సంగీతాన్ని, పిలుస్తాడు ఆనంద ప్రభాతమై" ఈ కవి ప్రబోధం, ఆనందంతో వేరువేరు దశల్లో పొందే భౌతికాధ్యాత్మికానుభవ రూపాలు. ప్రబోధంలో వేరుగా కన్పించే వ్యక్తిత్వం, ఆనందంలో ఒకటైపోయిన వ్యక్తిత్వమూ స్ఫూర్తికి వస్తాయి. భిన్నత్వం నుండి ఏకత్వానికీ, తమస్సు నుండి ఉదయానికీ ప్రయాణం మెదులుతుంది. ఆవర్తంలోని మలుపుల్ని సూచిస్తుంది.

మరో వేనరెడ్డి "కాలాన్ని కత్తిరించి చూడకు, దేశాన్ని విభజించి చూడకు". కాలం అఖండమైంది. దేవం సమగ్రమైంది. వీటిని ఒకే ప్రవాహంగా అఖండంగా దర్శించడంలో కాల్పనికమైన ఆనందం ఉంది. సంపత్కుమార రచనలో భారతీయాత్మ చైతన్య ప్రసారంతోపాటు సామాజిక జీవన గతులూ ప్రాముఖ్యం వహిస్తాయి. పేర్వారం రచనలో నిందాస్తుతి, స్తుతినింద మార్గంలో అధిక్షేప భాసురంగా జీవిత చిత్రణం కన్పిస్తుంది. వాస్తవికత మానవత ఈయన కవిత్వానికి రెండు చక్రాలుగా ఉన్నాయి. సుప్రసన్నాచార్య రచనలో భారతీయాత్మ చైతన్యంతోపాటు ఆధ్యాత్మిక జీవన భూమికలు దర్శనమిస్తాయి. ఇవి జీవితంలో సుగమ సుందరమైన అనుబంధాన్ని కోరేవి.

చేతనావర్త కవిత్వంలోని ఈ పార్శ్వం వ్యక్తిలో ప్రత్యేకతల్ని గుర్తిస్తుంది. భౌతికావసరాల్ని పరిగణిస్తుంది. మానసిక లోకాన్ని దృష్టిలో తీసుకుంటుంది. ఆత్మరూపాన్ని దర్శించే ప్రయత్నం చేస్తుంది. భారతీయ సంస్కృతికి సంబంధించిన మౌలికమైన విలువల్ని ప్రతిఫలింపజేసే ఉద్దేశం కలిగింది. వ్యక్తికీ సమాజానికీ మధ్య, భౌతికానికీ ఆధ్యాత్మికానికి మధ్య సముచితమైన అనుబంధాన్ని స్థాపిస్తుంది. జీవితంలో సభ్యతనూ సంస్కారాన్నీ వివేకాన్నీ ఆనందాన్నీ సౌభాగ్యాన్నీ ఆదర్శాన్నీ ఆపేక్షిస్తుంది. ఈ కవిత్వం ప్రజాస్వామ్యంలోని స్వేచ్ఛను అవసరం మేరకు ఉపయోగించుకుని వర్తించింది. స్వేచ్ఛా కవిత్వంలో ప్రత్యక్ష రాజకీయ ప్రభావాలకు దూరంగా కవిత్వ కళతోపాటు తాత్త్విక భూమికను గురించీ ఆలోచింపజేస్తుందీ చేతనావర్త పార్శ్వం.

**- మాదిరాజు రంగారావు, 040-23398899**